క్లుప్తంగా

పర్మనెంట్ చేయాలని మంత్రికి వినతి



కురవి: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పది సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ పేరుతో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులుగా తమను పర్మనెంట్ చేయాలని మంత్రి సత్యవతిరాథోడ్‌కు సోమవారం మహబూబాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు గంగరాజు, రాసమల్ల సురేష్, నవీన్, కామిండ్ల రాజు, వీరన్న, రవి, మహేష్, నవీన్, కన్న, జాగీర్‌లు మాట్లాడుతూ.. సంస్థలో తమ లాగే పనిచేసిన క్యాజువల్ లేబర్‌ను సంస్థ ఆర్టిజన్ గ్రేడ్–2 కింద విలీనం చేసుకున్నదని తెలిపారు.

కాల్వ పరిశీలన

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ఎస్ఆర్ఎస్పీ 60 డీబీఎల్ కెనాల్ ఉపకాల్వ అయిన 9 డీబీఎల్ కాల్వను రైతులు చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం మహబూబాబాద్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సమ్మిరెడ్డి పరిశీలించారు. కాల్వలో ఉన్న బండరాళ్లను తొలగించి నీరు అందిస్తామన్నారు. డీఈ వినయ్‌కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెండు సిమెంటు రోడ్ల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ నున్నా జయలక్ష్మిజగన్ శంకుస్థాపన చేశారు. ఒక్కో రోడ్డుకు రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, నాయకులు పాల్గొన్నారు.

పందుల బెడదను అరికట్టేందుకు బృందాలు

మహబూబాబాద్: పందుల బెడదను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పందులను పట్టే సమయంలో పందుల పెంపకందారులు మున్సిపల్ సిబ్బందితో వాగ్వివాదం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. రోడ్లపై పందులను పెంచవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

నెల్లికుదురు: ఏన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్‌లను రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం అందించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యుగేందర్, కార్యదర్శి రాకేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గుగులోతు రాముకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జంపయ్య, బాలు నాయక్, రాజు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి

బయ్యారం: అర్హులకు ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు మండా రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సోమవారం బయ్యారంలోని బుడగజంగాలకాలనీలో నిరసన తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటనూనె ధరలు పెంచుతూ సామాన్యులపై పాలకులు మోయలేనిభారం వేస్తున్నారన్నారు. అర్హులందరికీ దళితబంధు పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నంబూరి మధు, నాయకులు చంటి, మారయ్య, అంజి, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్



మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

కేసముద్రం: వచ్చే ఎన్నికల్లో మానుకోట నియోజకవర్గంలో బీజేపీ గెలుపొందడం ఖాయమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో చేపట్టిన పల్లెపల్లెకు బీజేపీ.. ఇంటింటికి హుస్సేన్‌నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్రను మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయంటే కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏంలేదని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రతి ఒక్కరి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ముందుగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచందర్‌రావు, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి, పంజాల దేవరాజు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మాధవ పెద్ది శశివర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గణేష్, కొముర‌య్య, సురేందర్, పాపారావు పాల్గొన్నారు.

అసమర్థ పాలనకు చరమగీతం పాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: కేంద్ర, రాష్ట్ర పాలకుల అసమర్థత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అధికార పార్టీలకు చెందిన వారికే కాకుండా పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కేవలం అధికార పార్టీకి చెందిన లబ్ధిదారులనే పథకాలకు ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు బాహాటంగా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తామంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని మాట్లాడుతున్నారన్నారు. ఇందుకోసం రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో అధికార పార్టీ ఎమ్మెల్యేలను చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, లోకేశ్వరరావు, అంబటి వీరస్వామి, రేకం శ్రీను, టి.రమ, రామకృష్ణ, బాబు, మోహన్, ఉపసర్పంచ్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను రెగ్యులరైజ్ చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

మహబూబాబాద్: అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్స్‌ను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్‌ల జిల్లా కార్యదర్శులు స్నేహలత, ఎల్ఆర్ ఈశ్వరి డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ హైమావతికి ఈనెల 11నుంచి చేపట్టే సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అదనపు పని భారాన్ని తగ్గించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఐ, పీఎఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సమ్మెలోపే సమస్యలు పరిష్కరించాలని లేని ఎడల సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆకుల రాజు, రేషపల్లి నవీన్, సరోజ, తిరుపత్మ, లక్ష్మినర్సమ్మ, రజియా, భానుమతి పాల్గొన్నారు.

సీతయ్యకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: ఆదివాసీ ముద్దుబిడ్డ, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు యాప సీతయ్యకు బీజేపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు జినుక రామ్మూర్తి రాష్ట్ర పార్టీకి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామంలో సోమవారం నిర్వహించిన దళిత మోర్చా సమావేశంలో రామ్మూర్తి మాట్లాడారు. 1994 నుంచి పార్టీ జెండా పట్టుకుని నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడి పనిచేస్తూ యాప సీతయ్య పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాలను విజయవంతం చేసి పార్టీని అభివృద్ధి చేసిన యాప సీతయ్యను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు దేవరపల్లి రాజశేఖర్ రెడ్డి, ఇందుర్తి రవీందర్ రెడ్డి, మారగాని రాజు, కొత్త రవీందర్ రెడ్డి, రాము, తుమ్మనపల్లి గణేష్, మాచర్ల మురళి పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలపై వినతి

కేసముద్రం: మండలంలోని మహముద్‌పట్నం గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సమస్యలపై సోమవారం కలెక్టర్, డీఈఓలకు ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు సంఘం నాయకులు పట్ల చందు, తరుణ్, చింటు, పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించడం లేదని, పైగా పిల్లలతో పనిచేయిస్తున్నారంటూ వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారంలో సోమవారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. పెద్ద నాగారం సెంటర్‌లో ఎస్సై సతీష్ అధ్వర్యంలో మంత్రాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, గంజాయి, గుడుంబా, గుట్కా, ఆన్‌లైన్ గేమింగ్, చెడు వ్యసనాలు, బాల్యవివాహలపై ప్రజలకు కళాజాత అధ్వర్యంలో అవగాహన కల్పించారు.

విజయవంతం చేయండి

దంతాలపల్లి: మండలకేంద్రంలో నేడు జరుగబోయే ప్రగతిశీల యువజన సంఘం తొర్రూరు డివిజన్ రెండో మహాసభను విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా కమిటీ సభ్యులు ఏరుగొండ ప్రవీణ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై చర్చించనునట్లు ఆయన తెలిపారు.

నేత్రదానం మహాదానం

మరిపెడ: నేత్రదానం మహాదానమని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అప్తాల్మిక్ అసిస్టెంట్ బాలాజీ, హెచ్ఈఓ కృష్ణ, హెల్త్‌సూపర్‌వైజర్, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్లలో అన్యాయం



మాట్లాడుతున్న ప్రభాకర్

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల ప్రమోషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు సంబంధించిన అడక్కేసిని తొలగించి గైడ్‌లైన్ విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 2023లో ప్రమోషన్ల విషయంలో విడుదల చేసిన గైడ్‌లైన్స్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు సంబంధించి అడక్కేసిని పొందుపర్చడం వలన రోస్టర్ కం మెరిట్‌ను పక్కన పెట్టేయడంతో ఉపాధ్యాయుల ప్రమోషన్లలో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అడక్కేసితో సంబంధం లేకుండా గైడ్‌లైన్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ బద్రి నాయక్, జిల్లా కమిటీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నల్లబెల్లం, తవేరా వాహనం సీజ్



అరెస్టును చూపుతున్న సీఐ భిక్షపతి

గూడూరు: కేసముద్రం మండలం మేగ్యతండాలో నాటుసారా తయారీ కేంద్రాలపై జరిపిన దాడిలో 400కిలోల నల్లబెల్లం, 20లీటర్ల నాటుసారా, ఒక తవేరా వాహనాన్ని సీజ్ చేసి, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎన్.భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో సీజ్ చేస్తున్న వాహనంతో పాటు అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం జిల్లా అధికారుల ఆదేశం మేరకు కేసముద్రం మండల మేగ్యతండాలో నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించామన్నారు. అందులో ఒక తవేరా వాహనంలో నల్లబెల్లంతోపాటు 20 లీటర్ల నాటుసారా తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వెంటనే వాహనం సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు బుచ్చయ్య, సుధాకర్, నరేష్, బాలకృష్ణ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషణమాసంలో పాల్గొన్న సీడీపీఓ, తదితరులు

మరిపెడ రూరల్: బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని మరిపెడ ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష అన్నారు. మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికొండతండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషణ్ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శిరీష మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు తప్పకుండా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు బెస్త సంపూర్ణ, కామిండ్ల లక్ష్మీకాంత, మద్దోజు కృష్ణకుమారి, వర్కర్లు, ఆశ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మరిపెడ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర సరుకుల ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) మండల నాయకులు నందిపాటి వెంకన్న డిమాండ్ చేశాడు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అఖిల భారత స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకన్న, ఉప్పలయ్య, సైదులు, జామూర్తి, కొండయ్య, వెంకన్న, పూలమ్మ, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

మరోసారి సేవ చేసే భాగ్యం కల్పించండి

- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్



గుండంరాజుపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు: డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు తనకు ఓటువేసి మరోసారి సేవ చేసే భాగ్యం కల్పించాలని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కోరారు. పల్లె పల్లెకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గుండంరాజుపల్లి, బావోజీతండా, పగిడిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా గుండంరాజుపల్లిలో పర్యటించి డబుల్ బెడ్రూం ఇళ్లు, మన ఊరు–మన బడిలో భాగంగా డిజిటల్ తరగతులను ప్రారంభించారు. అనంతరం బావోజీతండా, పగిడిపల్లి గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధిని చూసి చాలా సంతోషంగా ఉందన్నారు. కాళేశ్వరం నీళ్లు ప్రతి ఇంటికి వస్తున్నాయన్నారు. రైతుల పంటలకు 24గంటల విద్యుత్, రైతుబంధు వంటి పథకాలు తెలంగాణలో తప్ప దేశంలో ఏ రాష్ట్రంలో అమలు అమలు కాలేదన్నారు. మైనారిటీ బంధు ద్వారా 150మందికి లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలో రూ.20కోట్లతో సీసీ రోడ్లు, రూ.180కోట్లతో లింక్ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఒక మారుమూల తండాలో ఉంటూ 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులమంతా ప్రజా సేవకులం.. ప్రజలు ఆలోచన చేసి నిత్యం అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వల్లూరి పద్మ, జెడ్పీటీసీ మూల సునీత, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ మంగపతిరావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాంసింగ్, మండల మహిళా అధ్యక్షురాలు నిరూప, వైస్ ఎంపీపీ వీరన్న, సర్పంచ్‌లు శిరీష, సలీమా, ఎంపీటీసీ మమత, ఐలయ్య, మల్లయ్య, ఉపసర్పంచ్‌లు వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

డోర్నకల్: సైబర్ మోసంపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బందం ఉపేందర్‌రావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాయికుంటతండాకు చెందిన వాంకుడోత్ బాలాజీకి కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తక్కువ వడ్డీకి రూ.10లక్షల లోన్ ఇప్పిస్తామంటూ ఫోన్ చేశాడు. అతని మాటలు నమ్మి బాలాజీకి అవసరమైన డాక్యుమెంట్లు ఫోన్ ద్వారా పంపాడు. అనంతరం లోన్ మంజూరుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కోసం రూ.36వేలు ఖర్చు అవుతుందని, ఫోన్ ద్వారా పంపాలని గుర్తు తెలియని వ్యక్తి సూచించడంతో జూలై 31న ఫోన్‌పే ద్వారా డబ్బు పంపాడు. ఆ తరువాత బాలాజీ ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సోమవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల నివాళి

చిన్నగూడూరు: మహబూబాబాద్ జిల్లాలో పాత్రికేయుడిగా పని చేస్తున్న కట్ల రాజు తండ్రి సత్తయ్య సోమవారం చిన్నగూడూరులో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యానాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు వేర్వేరుగా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



దంతాలపల్లి: మండలంలో వితంతు మహిళ అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో వాల్యతండా గ్రామపంచాయతీకి చెందిన వితంతువు గుగులోత్ సైదా కూలి పనులకు వెళ్తూ ఇద్దరి పిల్లలను సాకుతుంది. గత నెల 13న దంతాలపల్లి మండల కేంద్రంలో కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె తండ్రి బానోత్ మదార్ బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభ్యంకాలేదు. మదార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గార్ల: గొడవలు వద్దు– రాజీలు ముద్దు అనే నినాదంతో ఈనెల 9వ తేదీ లోపు కోర్టులో కేసుల్లో ఉన్న ఇరువర్గాలు రాజీపడితే అట్టి కేసులు కొట్టివేయబడతాయని ఎస్సై బానోత్ వెంకన్న కోరారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. దీని కోసం ఫిర్యాదుదారుడు, నేరస్తులు ఆధార్ కార్డుతో మహబూబాబాద్ అదాలత్ కోర్టుకు రావాలని సూచించారు.

వల్మిడికి తరలిన ప్రజలు

పెద్దవంగర: పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని వల్మిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ప్రజలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ సోమేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాయ చంద్రయ్య శర్మ, జెడ్పీటీసీ జ్యోతిర్మయి సుధీర్, ఎంపీటీసీ ఎదునూరి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోనగిరి లింగమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



కేసముద్రం: కేసముద్రం విలేజిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ నగర్ కాలనీలో నివాసం ఉండే దడిగెల జ్యోతి (42) విద్యుదాఘాతంతో సోమవారం రాత్రి మృతిచెందింది. జిల్లా కేంద్రంలోని ఓ షాపులో పనిచేస్తున్న జ్యోతి తన పని ముగించుకొని రాత్రి సమయంలో ఇంటికి వెళ్లింది. వారి ఇంటి వెనకాల గల దండెంపై ఆరేసిన దుస్తులను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన ఆమె కుమార్తెలు ఇద్దరు వెంటనే మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జ్యోతిని పరీక్షించిన వైద్యులు ఆమె మృతిచెందిందని ధృవీకరించారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

కురవి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కురవి ఎస్సై బి.గోపి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ సబ్జెక్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కురవి: నేరడ గ్రామంలోని మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో తాత్కాలిక పద్ధతిలో బోధించేందుకు టీజీటీ సోషల్ సబ్జెక్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీకాం, టెట్ క్వాలిఫై అయి బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఆంగ్లలో బోధించేందుకు దరఖాస్తులు చేసుకునేందుకు నేడు(మంగళవారం) చివరి తేదీ అని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

పోలింగ్ బూతుల్లోనే కొనసాగించాలి

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలోని 85, 86 పోలింగ్ బూతులను అలాగే కొనసాగించాలని సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

అన్నదానం

డోర్నకల్: స్థానిక మున్సిపల్ కార్యాలయం రోడ్డులోని విఘ్నేశ్వరాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని సీఐ బందం ఉపేందర్‌రావు ప్రారంభించారు. శ్రీవిఘ్నేశ్వరస్వామి జ్ఞాన మందిరం సప్తమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత శ్రీవిఘ్నేశ్వరస్వామి కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వినూత్న రీతిలో బోధన

- పాఠశాలలను కాపాడిన ఉపాధ్యాయులు
- ప్రశంసలు, అవార్డులు పొందిన టీచర్లు
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం..

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ప్రశంసపత్రాలు, అవార్డులు అందజేస్తున్నారు. నేటి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.

విద్యార్థుల ఉన్నతి కృషి..



సబ్జెక్ట్‌పై అవగాహన కల్పిస్తున్న భిక్షపతి

పెద్దవంగర: విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూర్ గ్రామానికి చెందిన అల్లందాసు భిక్షపతి. మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు 2015లో గెజిటెడ్ హెచ్‌ఎంగా విధుల్లో చేరాడు. 2017 నుంచి 2020 వరకు వరుసగా నాలుగుసార్లు 100 శాతం ఫలితాలు సాధించి తల్లిదండ్రులల్లో విశ్వాసం నింపాడు. గణిత బోధనలో మేటిగా పేరు తెచ్చుకున్నాడు. దాత ఎన్ఆర్ఐ గాదె గోపాల్‌రెడ్డి రూ.3లక్షల సాయం చేయగా.. రక్షిత తాగునీటి ప్లాంట్, డయాస్, ప్రొజెక్టర్, ఫ్యాన్లు, తదితర వసతులను కల్పించాడు.

చదివిస్తూ.. సహకరిస్తూ..



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు రాజేశ్వర్

డోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కోవెల రాజేశ్వర్ విద్యార్థులకు వినూత్న రీతిలో బోధించి ఉత్తమ ఫలితాలను సాధించేలా కృషి చేస్తున్నారు. రాజేశ్వర్ విద్యనభ్యసించిన డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌లో 2011లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరి 13 సంవత్సరాలుగా ఫిజిక్స్‌తోపాటు మాథ్స్ సబ్జెక్టులను బోధిస్తున్నాడు. సరళమైన భాషలో సులువైన పద్ధతుల్లో పాఠ్యాంశాలను వినూత్నంగా బోధిస్తూ ఆకట్టుకుంటున్నాడు. సొంత డబ్బుతోపాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచర ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించి సకల సౌకర్యాలు కల్పించాడు. ఇటీవల స్నేహితులతో కలిసి లక్ష రూపాయలతో ఇనుప బీరువాలు, కుట్టు మిషన్లతో పాటు ఇతర వసతులు సమకూర్చాడు. రాజేశ్వర్ జిల్లాస్థాయిలో ఒకసారి, మండలస్థాయిలో రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై సన్మానం పొందాడు.

నిత్యం వాలీబాల్ శిక్షణే..



జయపురంలో క్రీడాకారులకు వాలీబాల్‌పై శిక్షణ ఇస్తున్న రిటైర్డ్ పీఈటీ వీరారెడ్డి

నర్సింహులపేట: పీఈటీగా ఉద్యోగ విరమణ తర్వాత కూడా విద్యార్థులకు ప్రతీరోజు వాలీబాల్‌లో శిక్షణ ఇస్తూ జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తున్నాడు. మండలంలని జయపురం గ్రామానికి చెందిన నెలకుర్తి రిటైర్డ్ పీఈటీ వీరారెడ్డి గ్రామంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్కూల్‌లో బాలికలకు వాలీబాల్‌లో శిక్షణ ఇవ్వడంతో జాతీయ, రాష్ట్రస్థాయిలో ఆడాడు. ఇప్పటి వరకు 35మంది క్రీడాకారులను జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆడారన్నారు. ఈమధ్య జరిగిన సీఎం కప్‌లో జిల్లా తరఫున గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలు ఆడటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆరు సంవత్సరాలుగా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామని, ఉదయం 6గంటల నుంచి 7.40 వరకు, సాయంత్రం 5గంటల నుంచి 6.40గంటల వరకు ప్రతి రోజు స్కూల్ గ్రౌండ్‌లో శిక్షణ ఇస్తామన్నారు.